అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
మంగళవారం 28 ఫిబ్రవరి 2023

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2004, 2005 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు సోమవారం సౌండ్ సిస్టంను అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి వివిధ రంగాలలో స్థిరపడ్డామని, తమ గుర్తింపుగా ఇప్పుడు చదివే విద్యార్థుల కొరకు చిరు బహుమతిని అందజేశామని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అజ్మత్‌ఖాన్, శ్రీనివాస్, మజార్, దేవన్న, గంగాధర్, రఫిక్ షరీఫ్ పాల్గొన్నారు.



ఉపాధి డబ్బుల కోసం ప్రదక్షిణలు

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఏసన్వాయి గ్రామానికి చెందిన మారపాక శంకర్ దంపతులు ఉపాధి డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు తప్పిదంతో తమ డబ్బులు వేరే వారి అకౌంట్‌లో వేశారని, ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలి డబ్బులు ఇప్పించాలని సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు.



నంబాల గ్రామ సర్పంచ్‌కు అరుదైన గౌరవం



నవతెలంగాణ-రెబ్బెన

న్యూఢిల్లీలో నేషనల్ సర్పంచ్‌ల సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని నంబాల గ్రామ పంచాయతీ సర్పంచ్ చెన్న సోమశేఖర్‌కు అరుదైన గౌరవం దక్కిందని పేర్కొన్నారు. నేషనల్ సర్పంచ్‌ల సంఘం తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా నేషనల్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జయరాం ఫల్సానియాను నియమించారు. కార్యక్రమంలో నేషనల్ సర్పంచ్‌ల సంఘం నాయకులు, వివిధ రాష్ట్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రీతి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

వరంగల్‌కు చెందిన డాక్టర్ ప్రీతి మృతిపై అనుమానాలున్నాయని, ఆమెది ఆత్మహత్య కాదని హత్య అని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు జాదవ్ వెంకట్‌రావు అన్నారు. సోమవారం విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ ప్రీతి ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత అధికారులు విచారణ జరిపి నిజనిజాలు బయటపెట్టి ఉంటే ఆమె మృతి చెంది ఉండేది కాదని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడిలే ప్రీతి మృతికి కారణమని అన్నారు. డాక్టర్ సైఫ్ డాక్టర్ డిగ్రీని రద్దు చేసి, ఎస్సీ ఎస్టీ చట్టం కింద జీవిత ఖైదు విధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్ నాయక్, నాయకులు నెహ్రూ నాయక్, రాము నాయక్, జరుపుల రాజేశ్వర్, ఎర్రన్న ఉన్నారు.

జైనూర్ : ప్రీతి ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడైన సీనియర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని గిరిజన వర్కింగ్ జర్నలిస్టు గౌరవ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ రామేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థిని డాక్టర్ దరావత్ ప్రీతిపై సీనియర్ విద్యార్థి చిత్రహింసకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. ర్యాగింగ్ పేరుతో యువతి జీవితాన్ని నాశనం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల హెచ్‌ఓడీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన జర్నలిస్టు సంఘాల నాయకులు దత్త, రాము, జాకీర్ పాల్గొన్నారు.

చింతగూడలో కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం చింతగూడలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సిద్దిక్, మాజీ ఎంపీటీసీ నీకురే నాగేందర్, సర్పంచ్ ఆత్రం సంజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కార్యక్రమంలో కంటిచూపు సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హరీష్, వైద్యసిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మున్సిపల్ సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎజెండాలో పొందుపరిచిన 28అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 20వ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య ఏర్పడకుండా మిషన్ భగీరథ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్లతో చర్చించి తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ పాలకవర్గంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్వో సతీష్, మున్సిపల్ ఏఈ మధు, టీపీఎస్ సతీష్, ఎలక్ట్రిసిటీ ఏఈ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్

జనంలోకి వెళ్లి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని వారి సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. బీజేపీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మార్చి 23వ తేదీ నుంచి ఆదిలాబాద్ జిల్లా నుంచే బస్సు జాత ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ జాతకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవనంలో సోమవారం నిర్వహించిన పార్టీ ప్లీనం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్రజెండాను నమ్ముకున్న పేదల పక్షాన ఉండి కొట్లాడేది మనమేనని గుర్తు చేశారు.



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువులు, ఆహార సరుకుల ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఒక శాతం ధనికుల వద్ద సంపద మిగతా 99శాతం మంది వద్ద ఉన్నదాని కంటే ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దేశ బడ్జెట్ కంటే ఐదు రేట్లు ఎక్కువగా ఉందని ఉదహరించారు. రాష్ట్రంలోనూ అనేక పోడు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని ఇందులో దశాబ్దాలుగా పోడు సాగుచేసుకుంటున్న వారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ వైఖరిపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.గంగన్న, బొజ్జ ఆశన్న, మంజుల పాల్గొన్నారు.



ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలని, వచ్చే రెండు వారాల్లోగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సత్వర చర్యలు తీసుకొని నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తొలుత అధికారులతో మాట్లాడుతూ అధికారులు ప్రజావాణికి నిర్ణీత సమయానికి హాజరు కావాలని అన్నారు. ఉన్నతాధికారుల సమావేశాలు, అత్యవసర పనుల నేపథ్యంలో ముందస్తు అనుమతితో హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లాలని అన్నారు. ప్రజావాణికి ద్వితీయ శ్రేణి అధికారులను పంపించాలని అన్నారు. ప్రజావాణికి హాజరయ్యే సమయంలో ఆ శాఖకు ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారాలకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలని అన్నారు. డబుల్ డిజిట్ ఉన్న దరఖాస్తులను ఆయా శాఖాధికారులు మార్చ్ 13లోగా, సింగల్ డిజిట్ కలిగి ఉన్న శాఖలు దరఖాస్తులను వారంలోగా జీరో స్థాయికి తీసుకురావాలని అన్నారు. దరఖాస్తుదారునికి స్పష్టమైన సమాచారంతో రాత పూర్వకంగా, తన సమస్య పరిష్కారం అవుతుంది, లేనిది అనే వివరాలను పొందు పరుస్తూ, ఒకవేళ ఏ శాఖ ద్వారా ఏ అధికారి ద్వారా సమస్య పరిష్కారం అవుతుందో దరఖాస్తుదారునికి సూచించాలని తెలిపారు.



ఇప్పటివరకు ఎంపీడీఓల పరిధిలో 268 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని వచ్చే వారంలోగా 140 పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా తహసీల్దార్‌ల పరిధిలో, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలలో ఉన్నటువంటి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి నివేదికలు అందజేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1411 దరఖాస్తులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారుడు పలు దఫాలుగా రాకుండా ఒకేసారి పూర్తిసమాచారం దరఖాస్తుదారునికి అందించాలని సూచించారు. వచ్చే బుధవారం లేదా గురువారం రోజున జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి పంపించాలని అన్నారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలను కలెక్టర్ స్వీకరిస్తూ, భూ సమస్యలకు సంబంధించి మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలకు సంబంధిన దరఖాస్తులు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. భూసమస్యలపై కుటుంబ తగాదాలు ఉంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని కలెక్టర్ సూచించారు. ఫించన్లు, ఉపాధి అవకాశాలు, వ్యక్తిగత సమస్యలు, కాలనీ సమస్యలు, తదితర అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటిపై చర్యలు చేపట్టడానికి ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ గణపతి, మున్సిపల్ కమీషనర్ శైలజ, డీఆర్డీఓ కిషన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి తరుణ్(21) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జన్నారం, చింతగూడ ప్రధాన రహదారి మధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బండకు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందాడు. తరుణ్ హైదరాబాదులో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నిజామాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న మెడికో దాసరి హర్ష తమ్ముడు, దాసరి ధనుష్ క్లాస్‌మెట్స్. ధనుష్, తరుణ్ ఇద్దరు కలిసి హర్ష మృతదేహాన్ని నిజామాబాద్ నుంచి చింతగూడకు తరలించి, దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత తరుణ్ స్వగ్రామమైన చింతలపెల్లికి వెళ్లిపోయి మళ్లీ సాయంత్రం తిరిగి వచ్చాడు. 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. దీంతో తల్లి స్వప్న కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. తరుణ్ తండ్రి శ్రీనివాస్ విదేశాలకు బతుకుదెరువు కోసం వెళ్లాడు. దీంతో చింతలపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు మిత్రులు రెండు రోజుల వ్యవధిలో మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చైర్‌కార్ సిస్టం తనిఖీ చేసిన అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే7 గనిపై డిడిఎంఎస్ (మెకానికల్) అధికారి దిలీప్ కుమార్, ఇంచార్జ్ గ్రూప్ ఏజెంట్ ఏ. వెంకటేశ్వరరెడ్డి, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణ అధికారి రవిశంకర్‌తో కలిసి సోమవారం గనిలోని చైర్‌కార్ సిస్టం తనిఖీ చేశారు. కొంత కాలంగా సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన చైర్‌కార్ సిస్టం పరిశీలించి, గనిలో నియమ నిబంధనలు ప్రకారం కార్మికులను భద్రతతో కూడిన పనులు చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం గనిలో చేపడుతున్న రక్షణ చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ జీ. రమేష్ బాబు, గ్రూప్ ఇంజనీర్ రాజా రవిచరణ్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, ఇంజనీర్ రమేష్ పాల్గొన్నారు.

ప్రీతిది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రీతిది ఆత్మహత్య కాదు హత్యానేనని దాని బాధ్యత రాష్ట్ర సర్కార్ దేనని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. సోమవారం రిమ్స్ మెడికల్ కాలేజ్ ఆవరణలో ప్రీతి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ నిఘా వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ పోలీస్ ఇంటలీజెన్సీ వ్యవస్థ రాష్ట్ర ప్రజల భద్రత కొరకు తక్కువ, కేవలం బీఆర్‌ఎస్ నాయకులకు పని చేయడంలోని ఉన్నదని ఆరోపించారు. వైద్య విద్యార్థిని పలు మార్లు పిర్యాదు చేసిన పట్టించుకోక పోవడంతో పరిస్థితి ఇంతా దాకా వచ్చిందన్నారు. ఇక నైనా పటిష్ట చర్యలు చేపట్టి, ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, దినేష్ మటోలియ, సోమ రవి, మహేందర్, విజయ్, మయూర్ చంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

రిమ్స్ ఎదుట ఏబీవీపీ నిరసన

మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మెడికల్ కాలేజ్ లోని రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్ వద్ద ఏబీవీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు వారికి తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కార్తీక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కేవలం ఫామ్‌హౌస్‌కి పరిమితమయ్యాడని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాడన్నారు. ప్రీతి మృతికి కారణమైన కారకులని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ టౌన్ సెక్రటరీ అక్షయ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ హరీష్, జిల్లా మీడియా కన్వీనర్ అఖిలేష్, అరుణ్, హరీష్, భార్గవ్, ఉదయ్, నిఖిల్ విద్యార్థి నాయకులు ఉన్నారు.

వ్యభిచారం కూపంలోకి యువతిని లాగే యత్నం...?

- అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం
- పోలీసుల అదుపులో నిందితులు

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని రాస్పెల్లి పంచాయతీ గెర్రెగూడ గ్రామానికి చెందిన ఓ యువతి(19) ఈ నెల 25న అదృశ్యం కాగా బాధిత కుటుంబీకులు ఈ నెల 26న ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 26న సదరు యువతి ఇద్దరు యువకులతో కలిసి కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ దుకాణంలో సామాగ్రి కొనుగోలు చేస్తుండగా గెర్రిగూడ గ్రామానికి చెందిన ఓ యువకుడు గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు, తల్లితండ్రులతోపాటు హుటాహుటిన కాగజ్‌నగర్ పట్టణంలో తిరుగుతున్న సదరు యువతితోపాటు మరో ఇద్దరిని పట్టుకుని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు సమాచారం. మాయమాటలు చెప్పి యువతిని తీసుకెళ్లిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యువతికి మాయమాటలు చెప్పి లోబర్చుకుని వేరే రాష్ట్రానికి తరలించి వ్యభిచార కూపంలోకి దింపేందుకు యత్నించి ఉంటారనే పలు రకాల కోణాల్లో పోలీసుల విచారణ సాగుతోందని సమాచారం. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఐదుగురు, మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన మరో యువకునితో పాటు వీరికి సహకరించిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నారు. కొత్తసార్సాల గ్రామానికి చెందిన మరో యువకుని కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఇంకా ఎంతమంది ప్రమేయముందనే విషయమై పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ పాత్ర ఈ వ్యవహారంలో ఉన్నట్టు వినికిడి. ఈ విషయమై రూరల్ సీఐ నాగరాజును ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీఓ జనరల్ కనక భీంరావు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఐటీడీఏ ఏపీఓ జనరల్ కనక భీంరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి దర్బార్ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అధికారులకు అందజేశారు. గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్ గ్రామానికి చెందిన నైతం లింబాజీ స్వయం ఉపాధికి ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరారు. లింగాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జె.సురేష్ తనకు సీఎం గిరివికాసం పథకం కింద బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని కోరారు. గుడిహత్నూరు మండలం తోషం గ్రామానికి చెందిన కె. అనసూయబాయి తమకు ఎడ్లబండి మంజూరు చేయాలని కోరారు. ఆయా అర్జీలను పరిశీలించిన ఆయన శాఖల వారీగా కేటాయించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కుమురం బాలు, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏఓ రాంబాబు, డీపీఓ ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసులకు ప్రభుత్వం న్యాయం చేయాలి



నవతెలంగాణ- మంచిర్యాల

ఆదివాసి తోటి (బిర్దు గోండ్)సేవా సంఘం ఆధ్వర్యంలో గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్క చిలుకయ్య, కుర్సెంగ వెంకటేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కుడిమెత తిరుపతి మాట్లాడుతూ జిల్లాలో 12 గ్రామాల్లో తోటి కులస్తులు నివసిస్తున్నారని, సుమారుగా 2000 జనాభా ఉంటుందని తెలిపారు. వారు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, పివిటిజిగా గుర్తించినప్పటికి ఎలాంటి ప్రతి ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. కళను నమ్ముకొని బతికే జాతికి కళాకారుల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు స్వయం ఉపాధి, సంక్షేమ పథకాలు మంజూరు చేసి తెగను ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షులు గోడం శ్రీనివాస్, ఆదివాసి తోటి సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం వెంకట్ రాజం, మరసుకోలా సుశీల, జిల్లా కోశాధికారి మరసుకోలా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి కుడిమేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెట్ల తొలగింపుకు టెండర్ల ఆహ్వానం

ఆసిఫాబాద్ : బెల్లంపల్లి మండలంలోని భూదాకలాం ఉద్యానవన నర్సరీలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చెట్ల టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ పిఓ వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన నర్సరీ శిక్షణ కేంద్రంలో 1214 వేప, 239 తుమ్మ చెట్లతో పాటు 638 వివిధ రకాల చెట్లు ఉన్నాయన్నారు. వీటిని తొలగించడానికి మార్చి 3 లోపు టెండర్లు దాఖలు చేయాలని, ఇతర అర్హతలు తెలుసుకోవడానికి ఆసక్తి గలవారు 9959868998 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా శివశంకరుని జాతర

వాంకిడి : మండల కేంద్రంలోని బెండారా గ్రామ సమీపం వద్ద శివాలయంలో సోమవారం శివశంకరుని జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు మండలంలోని సరండి, నార్లాబాపూర్, తమేళా, బెండారా, ఎనగొంది, వాంకిడి తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 28 ఫిబ్రవరి 2023

ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారికి కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నార్నూర్



సీనియర్ వేదింపులకు తట్టుకోలేక వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆత్మహత్యయత్నం చేసిన పీజీ వైద్య విద్యార్థిని దారావత్ ప్రీతి నిమ్స్‌లో ఐదు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ప్రీతి అత్మహత్యకు కారకులైన వారికి కఠినంగా శిక్షించాలని టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే విశ్వనాథ్ అన్నారు. గిరిజన సంఘాల పిలుపు మేరకు సోమవారం మండలంలోని జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బాలికలతో కలిసి మౌనం పాటించి, నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వారి వెంట ఉపాధ్యాయ సిబ్బంది చౌహన్ నెహ్రూ, గెడం గంగాధర్ ఉన్నారు.

పోడు సాగు చేస్తున్న ఎస్సీలకు అన్ని హక్కులు కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీలో పోడు సాగు చేస్తున్న ఎస్సీలకు అన్ని హక్కులు కల్పించాలని రైతు సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు రైతు సురక్ష సమితి ఆధ్వర్యంలో రైతు భరోసా దీక్షలో భాగంగా నిరసన తెలిపి, ఆర్డీఓ సురేష్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులతో పాటుగా ఎస్సీలు నివాసం ఉంటున్నరని అన్నారు. ఎస్సీలు సైతం పోడు భూములను సాగు చేసుకుంటూ మనుగడ సాగిస్తున్నారని, ప్రభుత్వం చేపట్టిన పోడు భూముల సర్వేలలో ఎస్సీలు సాగు చేసుకుంటున్న పోడుభూములకు సైతం ప్రభుత్వం హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే అన్ని ఫలాలు వీరికి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సమితి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బెంగాల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బేల మండలంలో బెంగాల్ డాక్టర్ల వైద్యం అమాయక ప్రజల ప్రాణాల మీదకు తీసుకొస్తుందని సామ రూపేష్ రెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. బేల మండలంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా బెంగాల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తీరుపై విచారణ జరిపించాలని కోరారు. కూలినాలి చేసుకునే ఆమాయక ఆదివాసీ ప్రజలతో పాటు, అనేక వర్గాల ప్రజలు బేలా మండలంలో ఉన్నారని అన్నారు. అయితే వారు రోజువారి పనుల నిమిత్తం కొన్ని అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ఈ క్రమంలో కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు వచ్చిన సందర్భంలో స్థానికంగా ఉన్న పలువురు బెంగాల్ డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి క్రమంలో అమాయక ప్రజలను అచ్చిరాని వైద్యంతో ఇబ్బందులకు గురి చేయడంతో పాటు ధనార్జన ధ్యేయంగా బెంగాల్ డాక్టర్లు బేల మండలంలో పాగా వేశారని తెలిపారు. వీరు కీళ్ల నొప్పులతో బాధపడుతూ తమ వద్దకు వచ్చిన ఆదివాసీ అమాయక ప్రజలకు మోకాలు, కీళ్లకు ఇంజక్షన్ వేయడంతో భవిష్యత్తులో వీరి ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశముందన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని అమాయక ప్రజల ప్రాణాలు కాపాడవలసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేక కుండా బెంగాల్ డాక్టర్ల నుంచి లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. అయితే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే ఎంక్వయిరీ చేసి వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మేకల జితేందర్, సునీల్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో గ్రూపు రాజకీయాలు

నవతెలంగాణ-కుభీర్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు తరచూ చెబుతుంటారు. ఈ విషయంలో నాయకులు ఏకతాటిపై ఉన్నప్పటికీ మండలంలో మాత్రం గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్న నియోజకవర్గంలోని మండలంలో బీఆర్ఎస్‌లో రెండు గ్రూప్‌లు ఏర్పడ్డాయని చర్చ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇటీవల నాందేడ్‌లో జరిగిన సీఎం సభకు మండలంలోని గ్రూప్ తగాదాలతో ఒక గ్రూపు నాయకులు బహిరంగ సమావేశానికి వెళ్లారు. ఇంకొక వర్గం సమావేశానికి వెళ్లలేదు. తాజాగా సోమవారం మండలంలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఒక గూపు నాయకులు హాజరయ్యారు. ఇంకొక గ్రూపు గైర్హాజరైంది. దీంతో మరోసారి మండలంలో గ్రూపు రాజకీయాలు బయట పడ్డాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇందంతా తెలిసినప్పటికీ ఎమ్మెల్యే దృష్టి సారించకపోవటం పలువురిని విస్మయానికి గురి చేస్తోందని, దీని వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీల ద్వారానే పౌష్టికాహారం



నవతెలంగాణ-ఉట్నూర్

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు, కిశోర బాలికలకు అంగన్‌వాడీల ద్వారానే పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో చింతగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, సర్పంచ్ పంద్రా లత హాజరయ్యారు. గర్భిణీ స్త్రీలు శ్రీమంతం వేడుకల్లో భాగంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు, కిశోర బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కేంద్రానికి వచ్చే వారికి సక్రమంగా పౌష్టికాహారం అందించి రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత, మిరాబాయి, భూలక్ష్మి, గ్రామ పటేల్ ఉన్నారు.

ఒకే ఊళ్లో గుండెపోటుతో ఇద్దరు మృతి

- చించాలలో విషాదం
- వీధినపడ్డ పేద కుటుంబాలు

నవతెంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో ఆదివారం రాత్రి రెండున్నరగంటల కాల వ్యవధిలో ఇద్దరు గుండె పోటుతో మృతి చెందడంతో ఆగ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఒరగంటి లక్ష్మణ్ (34), కండేలా రాఘవులు (42) అనే ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. ఒరగంటి లక్ష్మణ్ గ్రామంలోని రోడ్డుపై ఉన్నటుండి కుప్ప కూలిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు లక్ష్మణ్‌కు సీపీఆర్ చేసిన ఫలితం లేకుండా పోయింది. అలాగే అర్ధరాత్రి కండెల రాఘవులుకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. ఆస్పత్రిలోనే కుప్పకూలిపోయాడు. ఈ రెండు నిరుపేద కుటుంబాలే. లక్ష్మణ్‌కు భార్య, కూతురు ఉన్నారు. రాఘవులుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పేద కుటుంబాలకు పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉంటూ కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారని ఒకే రోజు రెండు పేద కుటుంబాల్లో ఈ దుర్ఘటన జరగడంతో గ్రామంలో విషాదఛ్చాయలు అలుముకున్నాయి.

సీసీఐ పున : ప్రారంభానికి

ప్రజలు ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పున్ణ ప్రారంభానికి జిల్లా ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ ప్రతినిధుల బృందంతో కలిసి సీసీఐ భూములను పరిశీలించారు. అనంతరం పరిశ్రమలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా ముందే సమాచారం తెలుసుకున్న పరిశ్రమ సిబ్బంది గేటుకు తాళం వేసి అక్కడి నుంచి ఉడాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అని ముందుగా దాని భూములను పరిరక్షించుకోవాలని అన్నారు. జిల్లాకి తలమానికంగా వెలుగొందిన సీసీఐ పరిశ్రమను పున్ణ ప్రారంభించాలని సీసీఐ సాధన సమితి పేరుతో సీపీఐ(ఎం), ఇతర పార్టీలు ప్రజా కార్మిక సంఘాలను కలుపుకొని ఒకవైపు పోరాటాల చేస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈ పరిశ్రమ యంత్రాలను, భవనాలను తుప్పు కింద అమ్మేయాలని టెండర్లుకు పిలిచిందన్నారు. అయితే దాన్ని కూడా విజయవంతంగా అడ్డుకున్నామని అన్నారు. దేశంలో నిర్మాణరంగం పెద్ద ఎత్తున విస్తరిస్తున్న సమయంలో సిమెంటుకు డిమాండ్ బాగా పెరుగుతుందని బాగా లాభాలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ సీసీఐ పరిశ్రమకు అలాంటి అన్ని రకాల అవకాశాలు ఉన్నాయని సుమారు 100 సంవత్సరాలకు సరిపడే లైఫ్ స్టోన్ ఉందని గుర్తు చేశారు. పరిశ్రమ ప్రారంభం అయితే జిల్లా అభివృద్ధికి సోపానంగా మారుతుందని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. భూబకాసురులు సీసీఐ పరిశ్రమ భూములను కాజేయాలని ప్రయత్నాలు మొదలు పెట్టారని అన్నారు. పరిశ్రమకు ప్రభుత్వ భూమి 800 ఎకరాలు, లీజు భూమి 1200 ఎకరాలు ఉండగా నేడు ఆ భూములను కాజేయాలనే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. భూములలో అక్రమంగా లేఅవుట్లు వేస్తూ వ్యాపారాలను ప్రారంభిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఈ భూములలో ఇన్ని అక్రమాలు జరుగుతున్న సీసీఐ అధికారులు, జిల్లా కలెక్టర్ చూసి చూడనట్లుగా వ్యవహరించడం సరైంది కాదని హెచ్చరించారు. పరిశ్రమ భూములు అంటే ప్రజల ఆస్తి అని అది అన్యాక్రాంతమవుతున్న పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతోనే భూ బకాసురులు రెచ్చిపోతున్నారని అధికార ప్రతిపక్ష పార్టీలు ఈ భూములను పరిరక్షించడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించకపోతే వారి హస్తం కూడా ఇందులో ఉందని ప్రజలు భావిస్తారని హెచ్చరించారు. అన్యాక్రాంతం అవుతున్న పరిశ్రమ భూములను పరిరక్షించాలని, అక్రమ లేఔట్లు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమను వెంటనే పున్ణ ప్రారంభించాలని, కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రజలను, రైతులను ఐక్యం చేసి సీసీఐ భూముల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, రైతు సంఘం నాయకులు లోకారి పోశెట్టి, డి.వెంకన్న, కేవీపీఎస్ నాయకులు జి.స్వామి, భూనిర్వాసితుల సంఘం నాయకులు అరవింద్, ఈశ్వర్ దాస్ పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పట్టణ సుందరీకరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం ఉదయం 5గంటల నుండి పట్టణంలోని పలు వార్డులలో కలెక్టర్ పర్యటించి, పారిశుధ్యం, కార్మికుల పనితీరు, తదితర అంశాలకు సంబంధించి పరిశీలించారు. పట్టణంలోని 43, 44, 45, 48, 49 వార్డులలో మున్సిపల్ కమీషనర్, సానిటరీ అధికారులతో పర్యటించి పరిశీలించారు. ముందుగా బస్ డిపో ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం, మురికి కాల్వలను పరిశీలించి, కార్మికులతో మాట్లాడారు. మున్సిపల్ నుండి కార్మికులకు అందిస్తున్న గ్లౌజ్‌లు, బూట్లు, రేడియం జాకెట్లు, మాస్కులు, తదితర వస్తువులను వాడుకోవాలని, చీపుర్లకు కర్రను జతచేసి రోడ్లు శుభ్రపరచడం వలన నడుము నొప్పి రాదని తెలిపారు. వంగి ఊడ్చడం వలన నడుము నొప్పి వస్తుందని అన్నారు. కర్రలను ఉపయోగించుకోవాలని సూచించారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి వేయాలని అన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయాలని, డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణంలోని కమర్షియల్ ఏరియాలో చెత్తను వేయడానికి డస్ట్ బిన్‌లను ఏర్పాటుచేయడంతో పాటు, వాటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ, వివరించాలని అన్నారు. చెత్తను రోడ్లపై వేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రచారం నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. వార్డ్ నంబర్ 44, 45, 49 భుక్తాపూర్ పరిధిలోని పలు వార్డులలో కలెక్టర్ పర్యటించి, సానిటేషన్ పనులను పరిశీలించారు. రోడ్లపై మిషన్ భగీరథ నీరు గాని, ఇండ్లల్లోని నీరు గాని, మురికి కాలువలలో నీరు గాని రాకుండా చూడాలని అన్నారు. ఎప్పటికప్పుడు ఆయా వార్డులోని జవాన్‌లు పర్యవేక్షిస్తూ పట్టణ పరిశుభ్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. గాంధీ చౌక్, వెజిటేబుల్ మార్కెట్, శివాజీ చౌక్, అంబేద్కర్ చౌక్‌లలోని మీడియన్‌లలో చెత్తను వేయకుండా వ్యాపారస్తులకు తెలియజేయాలని, చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేయాలన్నారు. పార్కింగ్ స్థలాన్ని గుర్తించాలని సూచించగా వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతంలోని స్థలాన్ని కలెక్టర్‌కు మున్సిపల్ కమీషనర్ చూపించారు. శివాజీ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వెళ్లే దారిలో మీడియన్ కట్టడాలు పూర్తిగా చేయించాలని అన్నారు. పట్టణంలోని వివిధ వార్డులలో నిర్మాణాలు జరుగుతున్నందున రోడ్లపై నిర్మాణపనులకు అవసరమైన ఇసుక, ఇటుక వంటివి రోడ్లపై వేయకుండా నిరోధించాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టి, ఇసుకలను తొలగించాలని మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించారు. నేతాజీ చౌక్‌లోని జిల్లా గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. పాఠకులు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలనీ, అవసరమైన వెలుతురు లేనందున చదువుకోవడం కష్టంగా ఉందని, లైబ్రరీ సమయాన్ని గ్రూప్స్ పరీక్షల సందర్భంగా పొడగించాలని కోరారు. అవసరమైన ఏర్పాట్లు త్వరగా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. అనంతరం ద్వారకనగర్‌లోని యోగ భవనం, పార్క్‌ను పరిశీలించి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలనీ కౌన్సిలర్ కోరారు. అనంతరం వార్డ్ నంబర్ 49 భుక్తాపూర్‌లోని డ్రైనేజీలను పరిశీలించి చెత్తను తొలగించాలని, పాడుబడిన పనికిరాని వాహనాలను రోడ్లపై నుండి తొలగించాలని, ఆయా యజమానులకు తెలియజేయాలని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో పర్యటించి, పట్టణ సుందరీకరణకు పరిశీలన చేస్తామని, కాలనీలోకి చెత్త బండ్ల సేకరణకు వచ్చే వాహనాలలో ఇంటింటి చెత్తను వేయాలని ప్రజలకు వివరించాలని అన్నారు. తడిపొడి చెత్తను విడివిడిగా సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. రోడ్లపై ఎలాంటి గుంతలు, నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు సరిచేయాలని అన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమీషనర్ శైలజ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, వార్డుల కౌన్సిలర్లు కే. శ్రీనివాస్, బి.సతీష్, ప్రవీణ్ కుమార్, ప్రకాష్, ఆయా వార్డులోని జవాన్ లు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి కేసీఆర్ కృషి



నవతెలంగాణ-కుభీర్

ప్రజాసంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 149 మంది లబ్ధిదారులకు కళ్యాణాలక్ష్మి, షాదీముబారక్, చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. త్వరలోనే గిరిజనులకు అటవీ హక్కుపత్రాలను పంపిణీ చేస్తామని అన్నారు. రైతులకు రైతుబంధు, రైతుభీమా, కేసీఆర్ కిట్, వివిధ రకాల పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ మరిన్ని పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. మండలంలోని 5గ్రామాల్లో కల్యాణ మండపాల నిర్మాణాన్ని ప్రారంభించామని అవీ పురోగతిలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి జెడ్పీటీసీ అల్కతాయి సంజయ్, స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, బీఆర్ఎస్ జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, జిల్లా కార్యదర్శి తూము రాజేశ్వర్ మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, ఎంపీటీసీ పోసాని బాయి, ఎంపీడీఓ కవిరాజ్, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, రెవెన్యూ అధికారి వెంకటరమణ, నిర్మల్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- భైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్

నవతెలంగాణ-కుభీర్



గ్రామంలో ఎలాంటి అసాంఘీక సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కుభీర్ మండలంలోని సౌన గ్రామ పంచాయతీలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సీఐ-1 ఎస్సై-4 హెడ్ కానిస్టేబుల్-8 స్పెషల్ పార్టీ సిబ్బంది-25 మందితో తనిఖీలో పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా పోలిసులు బృందాలుగా విడిపోయి గ్రామంలో ఉదయం 5 గంటల నుంచి ప్రతి ఇంటి ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకే పోలీసులు ఉన్నారని అన్నారు. దీంతో గ్రామంలో కొత్త వ్యక్తులు గ్రామంలో తిరుగుతున్నపడు పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రజలకు మేము ఉన్నామనే భరోసా భద్రత కల్పించడానికి ఈ కార్డెన్ సెర్చ్‌లు అదే విధంగా ప్రజలకు పోలీసులు ఎల్లపుడు అందుబాటులో ఉంటారని భరోసా భద్రత కల్గించుట ఈ తనిఖీలు నిర్వహించామని అన్నారు. అదే విధంగా గ్రామంలో ప్రధాన రహదారులు వెంట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేసేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో సరైన ధృపత్రాలు లేని వాహనాలు 35 మోటార్ సైకిల్, 3 ఆటోలు, ఒక్క ట్రాక్టర్‌ను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఈ తనిఖీల్లో చాలా వరకు వహనాలకు నెంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ లేకుండా ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరూ చేసుకునేలా చూడాలని అన్నారు. లేనియెడల కఠిన చర్యలు, జరిమానాలు, విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండీ షరీఫ్, స్థానిక సర్పంచ్ సంగీత, ఆనంద్ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

నేరం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు



నవతెలంగాణ-కడెం

కలప అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ అనిత హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం కడెం మండలంలోని ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలలో ఇటీవల కారులో కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన, సహకరించిన, మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఏడుగురు నిందితులను తహసీల్దార్ చిన్నయ్య వద్ద బైండోవర్ చేశారు. నిందితులు తిరిగి మరల నేరం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ అనిత హెచ్చరించారు. నిందితులను బైండోవర్ చేసిన డీఆర్ఓలు సిద్ధార్థ, ప్రకాష్, ఎఫ్‌బీఓ అలీమ్‌ను ఎఫ్ఆర్ఓ అనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని చిట్యాల బోరి గ్రామానికి చెందిన జంగుబాయి కళ్యాణలక్ష్మి చెక్కును డీసీసీబీ చైర్మెన్ ఆడ్డి బోజారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పెద్ద అన్నగా పేదలకు గొప్పవరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగు పటేల్, బీఆర్ఎస్ నాయకులు వసంత్ పరమేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ అర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఆంగ్లభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జలగం అనిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు ఆర్.దేవేందర్‌రావు మాట్లాడుతూ పోటీ పరీక్షల ఆంగ్ల ఆవశ్యకతను వివరించారు. త్వరలో నెల రోజుల ఉచిత ఆంగ్ల సర్టిఫికెట్ కోర్సుగా ఉదయం 8:30- 10:00 గంటల వరకు కళాశాల తృతీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లం నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సు లక్ష్యాలను, బోధన అంశాలను, శిక్షణ పద్ధతులను నిర్వాహకుడు వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల ఉద్యోగాల నియామకాలకు అవసరమయ్యే ఆంగ్ల శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు ఆడే సురేష్ అన్నారు. సోమవారం అంకోలి పీహెచ్‌సీలో డాక్టర్ ప్రీతి ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీ చదువుతున్న విద్యార్థినిని ర్యాగింగ్ పేరుతో మానసికంగా ఆమె వెంటపడి చావుకి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసిన కఠినంగా శిక్షించాలని అన్నారు. ఇకపై ఏ విద్యార్థికి జరిగిన ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తి ఎంబీబీఎస్, పీజీ పట్టా సర్టిఫికేట్‌లను రద్దు చేయాలని అన్నారు. అదే విధంగా బాధిత కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, రూ.50లక్షల ఎక్స్‌గ్రిషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగామణి, శ్రీనివాస్ మాడావి, ద్రుపథ, హిందుబాయి, పద్మ, కవిత, రుక్మబాయి, నారాయణ, ప్రేమ్‌సింగ్, సుభాష్ బొమ్మెత పాల్గొన్నారు.

చదువు, ఆటలు రెండూ ముఖ్యమే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి విద్యార్థికి చదువు, ఆటలు రెండు కండ్ల లాంటివని ఈ రెండు ఎంతో ముఖ్యమని ఆదిలాబాద్ జిల్లా ఒలంపిక అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. అటు చదువును, ఇటు ఆటలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఖేలో ఇండియాలో భాగంగా జూడోలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యార్థి కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించిన పట్ల సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా జూడోలు రాణించిన లక్ష్మణ్, డ్యాంజిల్‌లతో పాటు వారికి శిక్షణనిచ్చిన కోచ్ రాజును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ్ జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ డ్యాంజిల్ అసోసియేషన్ స్థాయిలో బ్రాస్ మెడల్ సాధించడం ఆదిలాబాద్ జిల్లాకే గర్వకారణమని అన్నారు. జాతీయ స్థాయిలో పటియాల, భూపాల్ లాంటి ఉత్తమ క్రీడా శిక్షణ ప్రాంతాల్లో అవకాశం లభిస్తే ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచే అవకాశాలుంటాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా పాఠ్యాంశాల బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు కైనమెటిక్స్ అంశంపై సెమినార్ నిర్వహించారు. స్థానిక సర్‌సిల్క్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ సెమినార్‌లో డీఈఓ మాట్లాడుతూ ప్రయోగాలు, ప్రాజెక్టులతో విద్యాబోధన చేపట్టాలని సూచించారు. గణితశాస్త్ర బోధనలో ఉపాధ్యాయుల సమస్యలకు డీఈఓ సమాధానాలు ఇచ్చారు. అనంతరం స్థానిక డీఆర్‌సీలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు పలు రకాల మైక్రోస్కోప్‌ల వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించగా, దీనిని కూడా డీఈఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, ఎంఈఓ భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, వరలక్ష్మి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, నజీర్, జయలక్ష్మి, రిసోర్స్ పర్సన్‌లు శాంతికుమార్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

ఫిబ్రవరి 22, 23 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ 33వ సమావేశంలో మూడు సంవత్సరాల కాల పరిమితికి జాతీయస్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జాతీయ సమావేశంలో 28 రాష్ట్రాల నుండి పదివేల మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా సంజీవరెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే ఆల్ ఇండియా సెక్రటరీగా జనక్ ప్రసాద్, సింగరేణి నుండి ఆరుగురుని జాతీయ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 14 తీర్మానాలు ప్రవేశపెట్టామని పేర్కొన్నారు.ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, కలవేణ శ్యామ్, జెట్టి శంకర్రావు, భీమ్ రావు, కష్ణమూర్తి, భీమ్ రవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమకు వేతన సవరణ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపడుతున్నారు. తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్న విషయం తెల్సిందే. మూడో రోజైన సోమవారం కూడా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. వేతన సవరణ విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, తమ ఆందోళనను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కె శ్రీనివాస్, రవీందర్, శ్రీరాములు, తిరుపతి, శ్రీదేవి, శేఖర్, రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ పేర్కొన్నారు. పట్టణంలోని 7వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ పొలం సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు ప్రజలు కంటి చూపు సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, బీఆర్ఎస్ పట్టణ ఇంఛార్జి గాండ్ల సమ్మయ్య, మున్సిపల్ మేనేజర్ నాగరాజు, కౌన్సిలర్ పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదేలు, అలుగుల శ్రీలత, పారుపల్లి తిరుపతి, సీనియర్ నాయకులు గురవయ్య పాల్గొన్నారు.

ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) గ్రామ పంచాయతీలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో మేకలకు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ సపాల్ శంకర్ నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రవీందర్, నవీన్, సాయి కిరణ్, రైతులు భీమిని మల్లేశ్, ఆవుల సాయి, కిరణ్ పాల్గొన్నారు. మామిడిగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ లావుడ్య సంపత్ ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు కొర్ర దేవి, టీము, జంగు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీల విజేతలకు జాతీయ సైన్స్ దినోత్సవం రోజు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం తెలిపారు

విగ్రహాల ధ్వంసంపై సమగ్ర విచారణ చేపట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు (టి) నియోజకవర్గంలోని ప్రాచీన దేవాలయాలలో ఉన్న విగ్రహాల ధ్వంసం ఘటనలు వరుసగా జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని, ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెజ్జూరు. చింతలమానెపల్లిలోని నాలుగు ఆదివాసీ ప్రాచీన దేవాలయాలలో ఉన్న విగ్రహాలను పథకం ప్రకారం ఒక ముఠా ధ్వంసం చేస్తోందని, ఇప్పటి వరకు జిల్లా ఎస్పీ కూడా ఆయా ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టలేదని అన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి ఈ ఘటనలకు పాల్పడుతున్నట్లు చింతలమానెపల్లి ఎస్ఐ ప్రెస్‌నోట్ విడుదల చేసి చేతులు దులుపుకున్నట్లు విమర్శించారు. గతంలో సిర్పూరు (టి)లోని దేవాలయంలో విగ్రహాల చోరీ జరిగిన సమయంలో కూడా మతిస్థిమితం లేని వ్యక్తి ఈ ఘటనకు పాల్పడ్డట్లు పోలీసులు ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఘటనలు ఏ ఒక్కరో చేసినవి కావని, ఒక ముఠా సంచరిస్తున్నట్లు తమకు అనుమానం ఉందని అన్నారు. దీనిపై తాము హిందూ సంఘాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గోలెం వెంకటేష్, వీరభద్రచారి, చేరాల శ్రీనివాస్, జాడి దీపక్, నరేష్, అనిల్, కుమార్‌గౌడ్, డొంగ్రి కార్తీక్ పాల్గొన్నారు.

3న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వొడపల్లి గార్డెన్స్‌లో మార్చి 3న ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని సీఈఓ రత్నమాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, సంబంధిత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

రజక వృత్తిదారులకు రుణాలివ్వాలి

- జిల్లా 3వ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

రజకుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తాపీ మేస్త్రి భవనంలో రజక వృత్తిదాల సంఘం జిల్లా 3వ మహాసభ తంగేళ్లపల్లి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 12 లక్షల మందికి పైగా రజకులు ఉన్నారని, వీరు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా తీవ్ర వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ వృత్తులపైన వేలాది మంది ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రజకుల సామాజిక భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు కర్నాల మల్లయ్య మాట్లాడుతూ రజకులకు రాజకీయ రంగంలో ప్రాధాన్యత కల్పించాలని, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రజక వృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని తెలిపారు. మోడరన్ ధోబి ఘాట్‌ల నిర్మాణానికి ప్రభుత్వ తరవు నుంచి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా బీసీ గురుకులాలలో రజకుల పిల్లలకు సీట్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం సిద్ధంగా ఉందని పిల్లల్ని బాగా చదివించాలని అన్నారు. జిల్లా రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి పైరాల రాములు రజకుల సమస్యలపై 9 తీర్మానాలని ప్రవేశపెట్టగా సాధన కోసం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రజకులు ఐక్యంగా ఉద్యమించాలని మహాసభ పిలుపునిచ్చింది. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పారుపల్లి శ్రీనివాస్, దావనంపల్లి లక్ష్మణ్, సంగెపు హన్మంతు, ముష్కర చందు, తరుగొప్పుల భాగ్య, పట్టణ కార్యదర్శి కొత్తకొండ పోచం, కంచర్ల రాజమల్లు సమ్మయ్య ,దురిశెట్టి రాములు రామస్వామి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలకు సంబంధించిన తునికాకు రాయల్టీ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా దహెగాం మండలంలోని లగ్గామ శివారులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి రూ.27 కోట్లు 2016-20 వరకు తునికాకు సేకరించిన కూలీలకు రాయల్టీ డబ్బులు వస్తాయన్నారు. రాష్ట్రంలో అటవుల సంరక్షణకు అందరు తోడ్పాటునందించాలని, 33 శాతం అటవులను పెంచాలని, హరితహారం ద్వారా ఇప్పటివరకు 267 కోట్ల మొక్కలు నాటామని, 7.7 శాతం అటవులు పెరిగాయని, అటవుల సంరక్షణతోనే మానవాళి మనుగడకు తోడ్పడుతుందన్నారు. అడవుల్లో అగ్గి పెట్టకూడదన్నారు. ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబీమా, రైతుబంధుతో పాటు గత ప్రభుత్వాల్లో ఎరువుల కొరత తీవ్రంగా ఉండేదని, రైతులకు ఇప్పుడు ఎరువుల కొరత లేకుండా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. తునికాకు చెట్లను పెంచడం ద్వారా అటవిలో ఆకు సేకరణ ద్వారా ఆర్థికాభివృద్ధి చెందుతారని, తునికాకు కట్ట గతంలో రూ.2 ఉండేదని, ఈ ఏడాది నుండి రూ.3కు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పెంచికల్‌పేట్, దహెగాం మధ్యలో పెద్దవాగు వద్ద మరొక వంతెన నిర్మాణంతో పాటు రోడ్డు కోసం రూ.19 కోట్లనిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు, దానిని పూర్తిచేసేల చూస్తామన్నారు. మార్చి నెలలో పోడు రైతులకు పోడు భూములకు పట్టాలను రైతులకు ముఖ్యమంత్రి అందజేయనున్నారని, రూ.99 వరకు రుణమాఫీ చేస్తున్నామని, ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు అందజేస్తామని, వన్యప్రాణుల దాడిలో మరణిస్తే రూ.10 లక్షలు అందజేస్తామని, పశువులు మరణిస్తే రూ.50 వేలు అందజేస్తాన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ కొమురం భీం జిల్లాకు తునికాకు రాయల్టీ క్రింద రూ.31 కోట్లు రాగా రూ.27 కోట్లు సిర్పూర్ నియోజకవర్గానికే వచ్చాయన్నారు. అలగే తునికాకు సేకరణకు గాను పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయిగూడ యూనిట్‌ను ప్రారంభించామని, వంద శాతం అటవీ శాఖ అధికారులు సహకరించాలన్నారు. దహెగాం మండలంలోని ఖర్జీ నుండి రాంపూర్ వరకు, పెంచికల్‌పేట్ మండలంలోని పెంచికల్‌పేట్ నుండి కమ్మర్‌గాం మీదుగా మురళీగూడ వరకు రోడ్డు పనులకు త్వరగా అనుమతులు మంజూరుచేస్తే ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, త్వరగా అనుమతి వచ్చేలా చూడాలన్నారు. అలాగే పెంచికల్‌పేట్ మండలంలోని కొండపెల్లి గ్రామంలో రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే త్వరలో నిర్వహించాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి పింఛన్ల కోసం ఇప్పటివరకు రూ.1286 కోట్లు ప్రభుత్వం అందజేసిందన్నారు. త్వరలోనే పోడు భూములకు పట్టాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, కలెక్టర్ సహదేవ్‌రావు, అడిసనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, రాష్ట్ర అటవీ సంరక్షణ అధికారి ఒబ్రియాల్, సీసీఎఫ్ వినోద్‌కుమార్, తహసీల్దార్ సరిత, దహెగాం, పెంచికల్‌పేట్ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి
- విద్యార్థులతో నిరసన ర్యాలీ



నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్రంలోని ఉన్నత చదువులు చదువుతున్న మెడికల్ విద్యార్థిని డాక్టర్ ప్రీతి, ఇంజనీరింగ్ విద్యార్థిని రక్షిత ర్యాగింగ్, సీనియర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషాద ఘటనల పట్ల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కాలేజీలో చదువుతున్న డాక్టర్ ప్రీతి కాలేజీలో వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకుందన్నారు. ప్రీతి కుటుంబానికి తగు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ ప్రీతి మరణం మరవకముందే వరంగల్ జిల్లాకు చెందిన జమున కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న రక్షిత ఆత్మహత్య చేసుకుందన్నారు. కొట్లాడి సాధించుకున్న బంగారు తెలంగాణలో భావితరాలను బలి చేసుకోవడం చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది విద్యార్థులు ర్యాగింగ్‌కు బలవుతున్నారని తెలిపారు. ర్యాగింగ్ చేసినటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ రాష్ట్రంలో పునరావృతం కాకుండా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్, మండల నాయకుడు రాకేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా కోర్టులో తమ తరవున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మంచి బుద్ధులు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులపై తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అనవసరంగా విద్యార్థులను దండిస్తే చట్టం ప్రకారం శిక్ష ఉంటుందని తెలిపారు. దండనతో కూడిన విద్య సరైనది కాదని ప్రేమతో విద్యార్థులను దగ్గర చేర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు వరకట్న నిషేధ చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం, ఆహార భద్రత చట్టం, వ్యక్తిగత రక్షణ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో విద్యార్థులు నడుచుకునే విధానాన్ని ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకుని ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, కార్యదర్శి నరహరి, ఏజీపి దీపక్ రావు, న్యాయవాదులు రాజీవ్ రెడ్డి, ప్రిన్సిపాల్ దివ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థి ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-కడెం

ఆధిపత్య కుట్రలు, వికృత మనుషుల మధ్య ఇమడలేక ప్రీతి చనిపోయిందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. మెడికల్ పీజీ కాలేజ్ స్టూడెంట్ ప్రీతికి గత ఐదు రోజులుగా హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స జరిగినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదని అన్నారు. ఆదివారం 9:10 నిమిషాలకు తను మరణించినట్లు నిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, హెచ్ఓడీలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ రోజు రోజు విపరీతంగా పెరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఇంకెంత మంది చనిపోతే ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల నేడు డాక్టర్ గిరిజన విద్యార్థి ప్రీతి చనిపోయిందని అన్నారు. ర్యాగింగ్ అరికట్టేందుకు ప్రత్యేకమైన డ్రైవ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దుర్గం లింగన్న పాల్గొన్నారు.

విధి కుక్కల బెడదపై అవగాహన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మున్సిపల్ కార్యాలయములో సోమవారం వీధి కుక్కల బెడదపై తగు సూచనలు, జాగ్రత్తలు తీసుకోవడానికి మాంస విక్రయదారులకు మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, కమిషనర్ జి. వెంకటనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చికెన్, మటన్, చేపల విక్రయదారుల దుకాణాల వ్యర్థాలను బయట పడేయరాదని, మున్సిపాలిటీ వాహనాల్లో మాత్రమే వేయాలని తెలిపారు. ఆ వ్యర్థాలను తిన్న వీధి కుక్కలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తాయని తెలిపారు. పందుల పెంపకందారులు పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో పందులను తరలించాలని, ఎవరైన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడివేసినట్లైతే వారిపై జరిమానాతో పాటు దుకాణం లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈజ్‌గాం శివరాత్రి జాతర ఆదాయం రూ. 4,19,620



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాతరలో హుండీల ద్వారా రూ. 4,19,620 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, ధర్మకర్తల మండలి చైర్మన్ ఇందారపు రాజేశ్వర్ రావు తెలిపారు. ఆలయంలో సోమవారం దేవాదాయశాఖ ఆదిలాబాద్ డివిజన్ పరిశీలకులు ఎం. రాజమొగిలి సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. సులభదర్శనం రూ. 100 టికెట్ ఏర్పాటు చేయగా రూ. 2,54,000, ప్రత్యేక దర్శనం రూ. 50 టికెట్ ఏర్పాటు చేయగా రూ. 1,56,450, ప్రత్యేక అభిషేకం ద్వారా రూ. 10,050, బహిరంగ వేలం ద్వారా 10,22,000, ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ. 4,19,620 ఆదాయం సమకూరిందన్నారు. మూడు రోజులు పాటు సాగిన జాతర ద్వారా మొత్తం రూ. 18,62,120 ఆదాయం సమకూరిందని తెలిపారు. గత ఏడాది 18,08,485 ఆదాయం రాగా ఈ ఏడాది 18,62,120 వచ్చింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ. 53,635 అధనంగా ఆదాయం సమకూరింది. హుండీల ద్వారా 2019లో రూ. 3,42,268, 2020లో రూ. 4,05,164, 2021లో రూ. 4,32,331, 2022లో రూ. 4,64,403, ఈ ఏడాది రూ. 4,19,620 ఆదాయం సమకూరింది. హుండీల ద్వారా గత ఏడాదితో పోల్చితే రూ. 44,783 ఆదాయం తగ్గింది. లెక్కింపు సందర్భంగా ఈజ్‌గాం పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాస చారి, రాజేశ్వర్, ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మ, ముద్దు నరహరి శర్మ ఆలయ కమిటీ సభ్యుడు శివప్రసాద్ తోపాటూ అరుణోదయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో షీటీం అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్చార్జి సునీత మాట్లాడుతూ విద్యార్థినుల అవసరాలకు 24 గంటలు పనిచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ లాంటి వాటికి గురైతే తమకు సమాచారం అందించాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో 100 నెంబర్‌కు డయల్ చేయాలని, లేదంటే షీటీం నెంబర్ 8712670564కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ నలంద, షి టీం సభ్యులు స్వప్న, శ్రీలతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాయి లింగిలో విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులను విలాస్‌గౌడ్, కృష్ణకుమారి దంపతులు సోమవారం పాఠశాలను సందర్శించి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదువుకోవాలని చదువుకుంటూనే భవిష్యత్తు ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగయ్య, పాఠశాల విద్య కమిటీ చైర్మెన్ రెబ్బతి గంగన్న పాల్గొన్నారు.



అందవెల్లి వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్



మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెన నిర్మాణ పనులను సోమవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అందవెల్లి సర్పంచ్ మేకర్తి గంగన్న పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించకుంటే క్రిమినల్ కేసులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించని విలేజ్ ఆర్గనైజర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రెవెన్యూ రికవరీ యాక్ట్ క్రింద వసూలు చేయడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. సోమవారం స్థానిక టీటీడీసీలో శ్రీనిధి అధికారులు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శ్రీనిధి రుణాలు తీసుకున్న 16 మండలాల్లో ఓవర్ డ్యూవ్ రూ.4.08 కోట్లు ఉందని, వాటిని వచ్చే మార్చి 10లోగా చెల్లించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సకాలంలో చెల్లించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు డీసీ చరణ్‌దాస్, శ్రీనిధి రీజనల్ మేనేజర్ పూర్ణ చందర్, డీపీఎం ఫైనాన్స్ నరేందర్ పాల్గొన్నారు.

భరంపూర్ బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం నాయకులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాదురి రామకాంత్, ఉపాధ్యక్షులుగా శాస్త్రీ, ప్రధాన కార్యదర్శి కత్తెర్ల శశికాంత్ యాదవ్, కోశాధికారి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లపు వినోద్, ప్రచార కార్యదర్శి పి. లక్ష్మణ్, సోషల్ మీడియా కో-ఆర్డీనేటర్ చింతపండు నర్సింలు, సలహాదారు ఈ స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ బరంపూర్ గ్రామంలో బీసీ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య కిషన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ ప్రీతి పీజీ విద్యార్థినిని ర్యాగింగ్ చేసి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తెలిపారు. ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేయాలచేయాని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, హెచ్‌ఓడీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అరికట్టేందుకు ప్రత్యేకమైన డ్రైవ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికీ ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మండలానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రాక

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలానికి మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రానున్నారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న రామాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయలకు భూమి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళా సంఘాలకు రూ.20కోట్ల రుణాల పంపిణీ



నవతెలంగాణ -కాసిపేట

మండల కేంద్రంలో స్వయం సహాయ మహిళా సమాఖ్య భవనంలో ముత్యంపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేష్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వరు ఆధ్వర్యంలో రూ.20కోట్ల రుణాలు అందించారు. కాసిపేట, బెల్లంపల్లి, మందమర్రి మండలాల సంఘాలకు రూ.10 కోట్ల రుణాలను, మంచిర్యాల జిల్లా మొత్తంగా మహిళా సంఘాలకు రూ.20 కోట్ల రుణాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ హైదరాబాద్ జీఎం కేవీ ప్రసాద్, రీజినల్ మేనేజర్ మురళి మనోహర్‌రావు, డీఆర్డీవో శేషాద్రి, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ చేతుల మీదుగా అందించారు. ముత్యంపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మంచిర్యాల జిల్లాలోనే వంద శాతం రుణాల రికవరీ సాధించినందుకు ముత్యంపల్లి బ్యాంక్ సిబ్బంది, సెర్ప్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అన్ని రకాల సహకారం అందిస్తుందని, బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముత్యంపల్లి బ్యాంక్ లింకేజ్ రుణాలలో వంద శాతం రికవరీకి కృషి చేసిన సెర్ప్ సిబ్బందిని ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం ముఖ్య అతిధులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, రీజినరల్ మేనేజర్ మురళి మనోహర్‌రావు, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం స్వర్ణలత, ముత్యంపల్లి బ్యాంక్ మేనేజర్ రాజేష్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సిరాజ్ ఖాన్, బెల్లంపల్లి మేనేజర్ రవి కుమార్, ఏపీఎంలు శ్యామల, లలిత కుమారి, సీసీలు, బీవోఎలు, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కూలీలకు తునికాకు బోనస్ చెక్కుల పంపిణీ

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

తునికాకు కూలీలకు సోమవారం బోనస్‌చెక్కులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పంపిణీ చేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన తునికాకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హజరయ్యారు. 2016 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెక్కులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీశాఖ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ అడవితోనే జీవనం, అడవితోనే సంపద, అడవి లేకపోయినట్లయితే జీవనాడులకే బతుకు మనుగడ కష్టమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి నీరు పోసి పెంచాలని అన్నారు. ప్రతి గ్రామ గ్రామాన నర్సరీలు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం కొన్ని లక్షల కోట్ల మొక్కలను అందిస్తున్నామని తెలిపారు. తునికాకు నాలుగు యూనిట్లపై టెండర్ పిలుస్తూ, సిర్పూర్ మండలంలో అర్బన్ జంతు పార్క్‌ను రూ.5 కోట్లతో నిర్మిస్తూ, దింద వాగు బ్రిడ్జిపై ఉన్న అనుమతులకు త్వరలో పరిష్కారం అయ్యేవిధంగా చూస్తామని తెలిపారు. పోడు వ్యవసాయం చేసే రైతులకు, మార్చ్ నెల ఆఖరి వరకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పట్టాల పంపిణి ఇక్కడ నుండే మొదలు పెడతామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చహత్ బాజ్‌పాయి, డీఎఫ్ఓ అశ్విన్‌సింగ్, కాగజ్‌నగర్ ఎఫ్డీఓ విజయ్‌కుమార్, ఎంపీపీలు డుబ్బుల నానయ్య, బసర్కార్ విశ్వనాథ్, రోజా, జెడ్పీటీసీలు డుబ్బుల శ్రీదేవి, డోంగ్రా అనూష, పుష్పలత, డీసీఎంఎస్ వైస్‌చైర్మెన్ కుమురం మాంతయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ కాసం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు జగగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ డోకే రాజన్న, నాయకులు వెంకన్న, మారుతి, శ్రీనివాస్, పాపయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫూలే నాటక ప్రదర్శన



నవతెలంగాణ-మంచిర్యాల

భారతదేశంలో సమ సమాజ నిర్మాణం కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు మహాత్మ ఫూలే అంటూ వివిధ సామాజిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మంచిర్యాలలో జరిగిన "సత్యశోధన" నాటక ప్రదర్శన సందర్భంగా ఏర్పాటు చేయబడిన సభలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మనకు మహోన్నత రాజ్యంగం అందించిన అంబేద్కర్ మహనీయుడిని, కొన్ని వర్గాల ప్రతినిధి అని కొందరు భావిస్తుంటారని పేర్కొన్నారు. నిజానికి భారతదేశం గర్వించదగ్గ సాంఘిక విప్లవ మూర్తి అంబేద్కర్ అంటూ పేర్కొన్నారు. మనువాదం మరింతగా విజృంభిస్తున్న నేటి తరుణంలో ఫూలే జీవితం, ఆయన చేసిన పోరాటాలు, రచనలు మనకు ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తాయని తెలిపారు. మనువాదాన్ని తుదముట్టించి శ్రామిక జీవుల హక్కుల నిలబెట్టే సమసమాజం కోసం పౌరులందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ప్రదర్శించబడిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఫూలే జీవన పోరాటాలను వివరించే "సత్యశోధన" నాటక ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. మహాత్మ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత చరిత్రలోని వివిధ ఘట్టాలను నాటకం వివరించింది. జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రాత్రి 7 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగిన నాటక ప్రదర్శనను తిలకించిన వివిధ సంఘాల నాయకులు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మెన్ పెంట రాజయ్య, రజక సంఘం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, బీసీ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వరరావు, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగురాజేశం, కులనిర్మూలన వ్యతిరేక కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల నరేష్, దూర్కె మోహన్, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనక రాజు, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక ఉద్యమకారులు ఇత్యాల కిషన్, మత్స్య కార్మిక సంఘం నాయకులు బోడెంకి చందు, నీలి శ్రీనివాస్, పల్లె భూమేష్, బుద్ధి చంద్రమౌళి, కాదాసి రవీందర్, పడాల రవీందర్, మెరుగు నరేందర్ సంకే రవి పాల్గొన్నారు.

పనులను గడువులోగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ కింద 237 పాఠశాలల్లో మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి పనులను చేపట్టడం జరిగిందన్నారు. మన ఊరు మన బడి పనులతో పాటు ఉపాధి హామీ పథకం కింద చేపట్టబడే ప్రహరీగోడ, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ పనులను, మోడల్ పాఠశాలలో మార్చ్ 15లోగా పూర్తిచేయాలని అన్నారు. అదేవిధంగా మిగిలిన 200 పాఠశాలల్లో పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి మార్చ్ 15లోగా ప్రారంభించుకోవాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా మలివిడత కింద పాఠశాలల్లో పనులు చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. పనులు పూర్తిచేసి ఆన్‌లైన్‌లో రికార్డు నమోదు చేసిన వెంటనే నిధులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గడువులోగా అన్ని పాఠశాలలు పూర్తిచేయాల్సి ఉందని అన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పనులను వేగవంతం చేసి ప్రభుత్వం ఆశించిన ప్రగతి సాధించాలని అన్నారు. మండలాల వారీగా మినిట్‌తో మినిట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదే కాలంలో పనులు పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిధుల అందుబాటులో ఉన్న మేరకు ఇన్నోవేటివ్‌గా పనులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మండలాలు, పాఠశాలల వారిగా సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారిణి టి.ప్రణీత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం గౌడ కులస్తులు ఐక్యంగా ఉద్యమించాలి

- జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్



నవతెలంగాణ-రెబ్బెన

హక్కుల సాధన కోసం గౌడ కులస్తులు ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 లక్షల పైచిలుకు జనాభా గల గౌడ కులస్తులు కల్లుగీత, వృత్తి రక్షణ హక్కుల సాధన కోసం రాజ్యాధికారంలో వాటా కోసం, పార్టీలకు అతీతంగా లక్ష్యంగా ఉద్యమించాలని అన్నారు. ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన, రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులను అన్ని రంగాల్లో అణచివేసిందన్నారు. గౌడ కులస్తులు వార్డుమెంబర్ నుండి ఎంపీ, ఎమ్మెల్యే వరకు కులదామాషా ప్రకారం రిజర్వేషన్ కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో మార్చి 5వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా మోకుదెబ్బ రెండో గౌడ సభకు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యం నర్సిములు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు రాగుల కిరణ్‌కుమార్ గౌడ్, కదిరె ఆంజనేయులు గౌడ్, మచ్చిమర్ల స్వామి గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీపై దాడికి నిరసనగా రాస్తారోకో

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ తిరుపతిపై గొడ్డలితో దాడిచేసినందుకు గాను గోలేటి గ్రామస్తులు గోలేటి విలేజ్ సింగరేణి ప్రధాన రహదారిపై బైటాయించారు. ఉపాధిహామీ కూలీలకు రక్షణ కల్పించాలని, దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూలీలకు సరైన రక్షణ కల్పించడంలో విఫలమైన సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సింగరేణి ఎక్స్ అండ్ పీసీ సిబ్బంది, రెబ్బెన పోలీసులు వచ్చి నచ్చజెప్పి రోడ్డుకు అంతరాయం లేకుండా చేశారు. రాస్తారోకోలో సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, బీజేపీ నాయకుడు ఆజ్మీరా ఆత్మారాం నాయక్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని వివిధ పార్టీల నాయకులు తహసీల్దార్ మల్లిఖార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థిని ప్రీతిపై సీనియర్ విద్యార్థి చిత్రహింసకు గురిచేయడంతో ఆమె మృతిచెందిందని, ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని, ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆజ్మీరా ఆత్మారాం నాయక్, సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, మాజీ జెడ్పీటీసీ అజ్మీరా బాబురావు, పూదరి సాయి పాల్గొన్నారు.

క్రికెట్ బాల్ తీయబోయి యువకుడు మృతి



నవతెలంగాణ-ఉట్నూర్

బావిలో పడ్డ క్రికెట్ బాల్ తీయబోయి ప్రమాదవశాత్తు బావిలో జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని శంకర్‌నాయక్ తండాలో చోటుచేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంకర్‌నాయక్ తాండకు చెందిన ఆడే ఆర్యన్(18) గ్రామ సమీపంలో తోటి యువకులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతున్నాడు. క్రికెట్ ఆడుతున్న సందర్భంలో క్రికెట్ బాల్ సమీపంలోని వ్యవసాయ భావిలో పడింది. బాలును తీయడాని వెళ్లిన ఆర్యన్ జారిపడి బావిలో పడ్డాడు. మృతుడికి ఈత రాకపోవడంతో, భావిలో పూడికలో కూరుకపోయి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆర్యన్ స్థానిక పులాజీ బాబా కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూకుమ్మడి రాజీనామాలకు వైద్యులు సిద్ధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బోథ్ సామాజిక కేంద్రంలో విధులు నిర్వర్తించే డాక్టర్స్‌పై సిబ్బందిపై తరుచూ వేదింపులకు గురిచేస్తున్న స్థానిక ఎంపీపీ, ముగ్గురు విలేఖరుల వలన వైద్యులు సామూహిక రాజీనామాలు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు కలెక్టరేట్‌లో సోమవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. అందుకు కలెక్టర్ రెండురోజుల్లో కమిటీ వేసి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అప్పటి వరకు విధులకు హాజరు కావాలని వైద్యులను సూచించడంతో కలెక్టర్ మాట గౌరవిస్తూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విధులను నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. సంబంధిత రిపోర్టర్స్‌పై డీపీఆర్ఓకి ఫిర్యాదు చేయగా అక్రిడిటేషన్ కార్డ్సలను పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. కమిటీ విచారణ అనంతరం సదరు రిపోర్టర్స్‌పై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ -వేమనపల్లి



గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రూ.9.78లక్షల నిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనఊరు-మనబడి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ఎంపిపి స్వర్ణలత, జెడ్పీటిసి స్వర్ణలత, నీల్వాయి ఎంపిటిసి సంతోష్ కుమార్, సర్పంచ్ గాలి మధు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, వైస్ చైర్మన్ లింగాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవరావు, జెడ్పీవైస్ చైర్మన్ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాచర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావించి ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం సీసీ రోడ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని అన్నారు.

బద్దంపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

మండలంలోని బద్దంపల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విస్తృతంగా పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తానని, గ్రామంలో 10 లక్షలతో సీసీ రోడ్డు, గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వంట గదిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా, సర్పంచ్ జెల్ల మొండి, ఉప సర్పంచ్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.